నేడు కప్పట్రాళ్లకు ఐజీ ఆకె రవికృష్ణ రాక

దేవనకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దత్తపుత్రుడు ఇగల్ విభాగపతి ఆకె రవికృష్ణ కప్పట్రాళ్లకు రానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నాటి ఫ్యాక్షన్ గొడవలో నలిగిపోయిన కప్పట్రాళ్లను కర్నూలు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న తరుణంలో దత్తత తీసుకున్నారు. అభివృద్ధే ధ్యేయంగా కప్పట్రాళ్లలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో ఐదేళ్ల కిందట ఎస్పీ స్థాయిలో గ్రామానికి వచ్చిన రవికృష్ణ నేడు ఐజీ స్థాయి అధికారిగా గ్రామానికి వస్తుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా పెట్రేగిపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కళ్లెం పడుతుందని ఆశిస్తే అదేం జరగ లేదు. పార్టీ రంగులు మార్చి కూటమి నాయకుల ఆశీస్సులతో కొందరు గుట్టుచప్పుడు కాకుండా సరిహద్దులు దాటిస్తున్నారు. దీని వెనుక పెద్ద మాఫియా ఉన్నట్లు తెలుస్తోంది. కర్నూలు నగరంలో ఇద్దరు బియ్యం డాన్‌లు, ఆదోనిలో బీజేపీ మాస్క్ వేసుకున్న మాజీ వైసీపీ యువ నేత కనుసన్నల్లో రేషన్ బియ్యం సరిహద్దులు దాటుతున్నట్టు తెలుస్తోంది. వీరికితోడు ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు ప్రాంతాల్లోనూ మాఫియా చెలరేగిపోతోంది. పలు ప్రాంతాల్లో ఎండీయూ వాహనాలు అడ్డాగా ఈ భాగోతం సాగుతున్నట్లు సమాచారం. అధికారం ముసుగులో నెలనెలా సాగిస్తున్న రూ.కోట్ల రేషన్ బియ్యం కుంభకోణంపై ఆంధ్రజ్యోతి కథనం.





హద్దులు దాటి ఆదాయం

నవంబరు 16న ఆదోని మండలం బలదూర్ గ్రామంలో రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్న రాయితీ బియ్యం

నవంబరు 15 న రేషన్ బియ్యం లారీని మంత్రాలయం మండలం మాధవరం చెక్ పోస్టు వద్ద అధికారులు సీజ్ చేశారు. ఆదోని నుంచి రాయచూరుకు బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు

- రెచ్చిపోతున్న బియ్యం మాఫియా
- కూటమి ప్రభుత్వంలోనూ ఆగని దందా
- అక్రమంగా కర్ణాటకకు రవాణా
- ఆదోనిలో బీజేపీ యువ నేత కనుసన్నలో వ్యాపారం
- కర్నూలులో ఇద్దరు బియ్యం డాన్‌ల ఇష్టారాజ్యం
- ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరులోనూ ఆగని వైనం
- రూ.కోట్లలో రేషన్ బియ్యం కుంభకోణం







సెప్టెంబరు 8న తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యం లారీని సీజ్ చేసిన పోలీసులు

కర్నూలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏపీ ప్రభుత్వ పౌర సరఫరాల (సివిల్ సప్లయ్) శాఖ పర్యవేక్షణలో 2,437 నిత్యావసర సరుకుల పంపిణీ దుకాణాలు ఉన్నాయి. 12.18 లక్షల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత బియ్యం, రూపాయికి కిలో బియ్యం పథకాల ద్వారా నెలకు 20 వేల మెట్రిక్ టన్నులు పేదలకు సరఫరా చేస్తున్నాయి. ప్రతి వ్యక్తికి ఐదు కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికి లెక్కకట్టి రాయితీ బియ్యం ఇస్తున్నారు. ఈ లెక్కన రేషన్ బియ్యం రూపంలో ప్రభుత్వ ఖజానాపై నెలకు రూ.83 కోట్లకు పైగా భారం పడుతోంది. భారమైనా సరే సామాన్యులకు ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంగా ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో బియ్యం మాఫియా పెట్రేగిపోతే.. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా బియ్యం దందా ఆగడం లేదు. మాఫియాకు నాయకత్వం వహించే డాన్‌లు మారారు. గత వైసీపీ హయాంలో రేషన్ బియ్యం మాఫియా రూ.కోట్లకు పడగలెత్తారు అంటే ఏ స్థాయిలో అక్రమ రవాణా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. తామేం తక్కువా అంటూ కూటమి ప్రభుత్వంలోనూ రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నారు. అధికార కూటమి నాయకుల అండదండలు ఉండడంతో నిఘా అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

కిలోకు రూ.46 ఖర్చు:

వరి ధాన్యం పండించే రైతులకు భరోసా.. పేదలకు ఆకలి తీర్చి ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు, మిల్లు ఆడించడం, రవాణా, గోదాముల బాడుగ.. ఇలా వివిధ రూపాల్లో కార్డుదారుడికి అందించేసరికి కిలోకు రూ.46 ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 20,501 మెట్రిక్ టన్నులు కోటా ఉంటే 90 శాతం 18 వేల టన్నులు పేదలకు ఇస్తున్నట్లు పౌర సరఫరా అధికారులు తెలిపారు. నెలకు రూ.83-85 కోట్లు చొప్పున ఏడాదికి రూ.వెయ్యి కోట్లకు పైగా ప్రభుత్వంపై భారం పడుతోంది. ఐదుగురు సభ్యుల కుటుంబానికి 25 కిలోలకు రూ.1,150 బియ్యం రాయితీ ఇస్తున్నారు. కార్డుదారుడి నుంచి మధ్య దళారులు కిలో రూ.10-12లకు సేకరిస్తే వారి నుంచి మాఫియా కిలో రూ.16-18లకు సేకరించి సరిహద్దులు దాటించి కర్ణాటకలో కిలో రూ.25-28కు విక్రయిస్తున్నారు.

మిగతా 8లో..



ఆదోని పట్టణం కోట్ల విజయభాస్కరరెడ్డి కాలనీలో నవంబరు 15 రాత్రి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు దాడులు చేసి సీజ్ చేశారు.

బడిలో పండుగ

- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భారీ సమావేశాలకు సర్వం సిద్ధం
- జిల్లాలో 1,457 పాఠశాలలు..
- నిర్వహణకు రూ.47.45 లక్షల నిధులు
- నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన పాఠశాల విద్యను అభివృద్ధి చేసేందుకు నడుం బిగించింది. వీటి అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములు అయ్యేలా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో విద్యార్థి ప్రగతి తెలుసుకోవడానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నాణ్యమైన విద్యను అందించడానికి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు మధ్య మంచి సంబంధాలు నెలకొల్పేందుకు ఈ సమావేశాలు ఎంతో ఉపయోగపడుతాయి. ఈ సమావేశాలను ఒక పండుగలా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్య నాణ్యత అనే విషయాలపై స్టార్ రేటింగ్స్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించేందుకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో పాఠశాలల ప్రాంగణాల్లో అలంకరణ, టెంట్, మైక్ ఏర్పాటు చేస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను అందజేస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో జరిగే సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు మంజూరు చేసింది. కర్నూలు జిల్లాలో మొత్తం 1,457 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 2.90 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే ఈ పాఠశాలల్లో 7,947 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. పాఠశాలలకు ప్రభుత్వం రూ.47.45 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులకు అవసరమైతే.. దాతల నుంచి సమీకరించుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచనలు చేసింది.



సర్వం సిద్ధం



పేరెంట్స్, టీచర్స్ మీట్‌కు సర్వం సిద్ధం చేశాం. ఈ సమావేశాలను విజయవంతం చేసేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకున్నాం. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. ఎంఈవోలు, ఉప విద్యాశాఖ అధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు, పూర్వ విద్యార్థులకు సమాచారం పంపించాం. పాఠశాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కోసం సమాచారం చేరవేశాం. - శ్యామ్యూల్ పాల్, డీఈవో

భూ సమస్యలకు పరిష్కారం

- జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు
- కలెక్టర్ పి. రంజిత్‌బాషా

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నదని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సుకు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, జేసి బి. నవ్య హాజరయ్యారు. ముందుగా రాజ్యాంగ రూపకర్త డా.బిఆర్. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 472 గ్రామాలు ఉన్నాయని అందులో 250 గ్రామాల్లోనే రీ సర్వే పూర్తయిందని, మిగతా గ్రామాల్లో కూడా రీ సర్వే చేయాల్సి ఉందని అన్నారు. రీ సర్వే జరిగిన..జరగని గ్రామాల్లో కూడా రెవెన్యూ సదస్సులు జనవరి 8 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, పీజీఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ దీప్తి, కల్లూరు తహసీల్దారు కె. అంజనేయులు, ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, 36వ వార్డు టీడీపీ నాయకుడు ఆర్. తిరుమలేశ్వరరెడ్డి పెద్దబాచుపల్లి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ఎమ్మెల్యే



కృతిహొయలు

ఉప్పెన సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో అలలా ఎగసిపడిన కృతిశెట్టి శుక్రవారం నంద్యాలలో సందడి చేసింది. నంద్యాల పట్టణంలోని ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమెను చూసేందుకు యువకులు ఎగబడ్డారు. షాపింగ్ మాల్ ప్రారంభంలో పాల్గొన్న ఆమె కాసేపు అభిమానులతో మాట్లాడారు. డాన్స్ చేసి యువతను ఉర్రూతలూగించారు.
- నంద్యాల రూరల్

నెలాఖరులోగా పూర్తి చేయండి : మంత్రి బీసీ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లపై గుంతలు పూడ్చే పనులు ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్అండ్‌బీ నేషనల్ హైవే, మున్సిపల్ శాఖల అధికారులతో రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్లపై గుంతలు పూడ్చే పనులు కర్నూలు డివిజన్‌లో 41 శాతం మాత్రమే జరిగాయని, ఈ పనులు వేగవంతం చేయాలని డివిజన్ ఈఈని ఆదేశించారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తవుతాయని అన్నారు. న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ వర్క్స్ కింద మంజూరు చేసిన రోడ్డు పనులు ఇంకా మొదలు కాలేదని, 10 రోజుల్లో పనులు మొదలు పెట్టాలని మంత్రి ఆర్అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ పి. రంజిత్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి. వెంకటనారాయణమ్మ, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



విద్యార్థులు తయారు చేసిన ఆహ్వాన పత్రికలు





ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేస్తున్న దృశ్యం

పేరెంట్స్ మీటింగ్‌కు రండి..!

- అదిరిపోయేలా ఆహ్వాన పత్రికలు
- విభిన్న ఆకృతుల్లో విద్యార్థుల సృజన

ఆత్మకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేటితరం విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో కూడా ప్రతిభ చాటుకుంటున్నారు. సృజనాత్మకతకు మరింత పదునుపెట్టి అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమలో దాగివున్న నైపుణ్యాన్ని వెలితీశారు. శనివారం తమ పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు సంబంధించి తమ తల్లిదండ్రులకు, పూర్వ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆహ్వానం అందించేలా వారే స్వయంగా ఆహ్వాన పత్రికలను తీర్చిదిద్దారు. ఎవరికి వారు తమ ఆలోచనలకు తగ్గట్లుగా వివిధ ఆకృతుల్లో రూపొందించిన ఆహ్వాన పత్రికలు అందరిని ఆకట్టుకున్నాయి. పెన్సిల్, పుస్తకం, పుష్పం, సీతాకోకచిలుకలు



తదితర విధాలుగా సుమారు 20రకాలుగా తయారు చేసిన ఆహ్వాన పత్రికలు అందరినీ ఆకట్టుకున్నాయి. బయట వివిధ ఆకృతుల్లో కనిపించినప్పటికి తెరిచి చూస్తే లోపల చక్కటి ఆహ్వాన సందేశాన్ని అద్భుతంగా పొందుపరిచారు. వీటినే పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులకు, పలువురు అధికారులకు, ప్రజాప్రతినిధులకు అందజేసి తమ పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు హాజరు కావాలని ఆహ్వానం పలికారు. శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి సైతం ఇదే ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించగా ఆయన విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులదే ఆలోచన



తమ పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా జరుపుకోవాలని భావించాం. ఇందులో భాగంగా తల్లిదండ్రులకు, పూర్వవిద్యార్థులకు, ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేయాలని ఆలోచించాం. అయితే వీటిని బయట ప్రింటింగ్ ప్రెస్‌ల్లో కాకుండా విద్యార్థులతో స్వయంగా తయారు చేయిస్తే వారిలో సృజనాత్మకత పెరగడంతో పాటు ప్రత్యేకంగా ఉంటుందని విద్యార్థులకు సూచించాం. దీంతో విద్యార్థులు పోటీ పడి వివిధ ఆకృతులతో కూడిన ఆహ్వాన పత్రికలను తయారు చేశారు. ఇవే ఆహ్వాన పత్రికలను పలువురు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఇవ్వగా వారు సైతం ఆశ్చర్యానికి లోనయ్యారు. చిన్నారులు ఇచ్చిన ఆహ్వాన పత్రికలను అందరూ భద్రపర్చుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

- నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆత్మకూరు

పెళ్లికి రావాలని ప్రధాని మోదీకి ఆహ్వానం

కర్నూలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి తన కూతురు వివాహానికి రావాలని మంత్రి టీజీ భరత్ శుక్రవారం కోరారు. ఈ నెల 26న తన కుమార్తె టీజీ శ్రీఆర్యపాన్య, బొమ్మిడాల వెంకటశ్రీ నలిన్‌ల వివాహానికి హాజరై ఆశీర్వాదించాలని కోరుతూ ప్రధానికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 26న గురువారం శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో టీజీ శ్రీఆర్యపాన్య, బొమ్మిడాల వెంకటశ్రీ నలిన్‌ల వివాహం జరగనుంది.



ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పెళ్లి కార్డు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

పడిపోయిన ఉల్లి ధర



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో గతంలో ఎన్నడూ లేని విధంగా కనిష్ఠ ధర శుక్రవారం రైతులకు అందింది. ఇప్పటి దాకా కొన్ని సంవత్సరాలుగా 200 నుంచి రూ.400 మాత్రమే కనిష్ఠ ధర రైతులకు అందింది. శుక్రవారం ఏకంగా క్వింటానికి రూ.2,519 దక్కడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, సెక్రటరీలు వెంకటేశ్వర్లు, రెహమాన్ తెలిపారు.

మల్లన్న సన్నిధిలో హీరో నాగార్జున కుటుంబం



ఆలయ ప్రాంగణంలో సినీ హీరో నాగార్జున, నాగచైతన్య, శోభిత

శ్రీశైలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శుక్రవారం సినీ హీరో అక్కినేని నాగార్జున కుటుంబం దర్శించుకుంది. నాగార్జునతో పాటు కుమారుడు నాగచైతన్య, కోడలు శోభితతో కలిసి దర్శించు కున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ అధికా రులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు మల్లికార్జున స్వామివారికి అభిషేకం నిర్వహించి, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు జరిపించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వీరికి ఆలయ అర్చకులు, వేదపండి తులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసా దాలను అందజేశారు. అభిమానులతో నాగార్జున ఫొటోలు దిగి సందడి చేశారు.

ఉపాధి కల్పించేలా సాంకేతిక ప్రాజెక్టుల రూపకల్పన

- ప్రతిభ వెలికి తీయడానికే ఈటెక్ ఫెస్ట్
- ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్-2024 వేడుకల్లో మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 06 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఉపాధి కల్పించేలా సాంకేతిక ఆవిష్కరణలు రూపొందించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్-2024 వేడుకల్లో మంత్రి ఫరూక్‌తో పాటు కలెక్టర్ రాజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్యార్థులలో అణగారిన ప్రతిభ వెలికి తీయడానికి ఈటెక్ ఫెస్ట్ దోహదపడుతుందన్నారు. ఈటెక్ ఫెస్ట్‌లో 12 పాలిటెక్నిక్ కాలేజీల నుంచి 96 ప్రాజెక్టులపై 324 మంది విద్యార్థులు ఆవిష్కరణలు ప్రదర్శించారని అన్నారు. సాంకేతిక విద్యను ప్రోత్సహించడం ద్వారా టెక్స్‌టైల్ పార్కులు, లెదర్‌పార్కులు, వ్యవసాయ ఉత్పత్తులు, తదతర రంగాలలో అభివృద్ధి చెందడంతో పాటు ఉత్పాదక పెరిగి వృద్ధి రేటు సాధ్యమవుతుందన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెంచే దిశలో సాంకేతిక ప్రాజెక్టుల ఆవిష్కరణలు ఉండాలన్నారు. పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే ప్రతి అంశాన్ని సవాలుగా తీసుకోవాలని అన్నారు. ఎస్‌వీయూ రీజనల్ జాయింట్ డైరక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియా మాట్లాడుతూ ఈటెక్ ఫెస్ట్ పుస్తక జ్ఞానాన్ని నిజ జీవితానికి ఎలా అన్వయించుకోవాలో విద్యార్థులకు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజల్వన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎస్‌వీయూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియా, తదితరులు

కలెక్టర్‌ను కలిసిన శ్రీశైలం ఈవో



కలెక్టర్ రాజకుమారికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

శ్రీశైలం/నంద్యాల కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి డిప్యూటీ కలెక్టర్ ఎం. శ్రీనివాసరావు శుక్రవారం కలెక్టర్ రాజకుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈవో ఎం. శ్రీనివాసరావు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించి ప్రసాదాలు అందజేశారు. అలాగే ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్‌ను కలిశారు.

9న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 06 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన ఉదయం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మౌలానా ముస్తాక్ అహ్మద్ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తనను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించినందులకు కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్నమౌలానా ముస్తాక్ అహ్మద్

హద్దులు దాటి ఆదాయం

(7వ పేజీ తరువాయి)

కనిపించని కుంభకోణం ఇది!

జిల్లాలో కర్నూలు సోనా, నంద్యాల సోనా బియ్యం సాగుకు ప్రసిద్ధి. సామాన్యులు సైతం సన్నరకం సోనా బియ్యానికి అలవాటు పడ్డారు. రేషన్ బియ్యానికి దోసెలకు మాత్రమే వాడుతున్నారు. మిగిలిన 35 శాతానికి పైగా మాఫియా పంపించే దళారులకు అమ్మేస్తున్నారు. నెలనెలా దాదాపుగా రూ.20-25 కోట్లకు పైగా విలువైన రేషన్ బియ్యం కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. చాప కింద నీరులా విస్తరిస్తున్న కనిపించని కుంభకోణం ఇది. కర్నాటక నుంచి మహరాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోని మద్యం తయారీ పరిశ్రమలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

ఎండీయూ వాహనాల్లో కొనుగోలు

జిల్లా కేంద్రం కర్నూలు, ఆదోని సహా వివిధ ప్రాంతాల్లో పలువురు ఎండీయూ వాహన ఆపరేటర్లే బియ్యం బదులు కిలోకు రూ.10 లెక్కకట్టి ఇస్తున్నారు. కొందరు మహిళలు ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు. అలా సేకరించే బియ్యాన్ని అర్ధరాత్రి మాఫియా పంపించే ఆటోలలో చెప్పిన ప్రదేశానికి చేరవేస్తారు. ఆటోల్లో తీసుకొచ్చిన బియ్యాన్ని ఓ లారీలో లోడ్ చేసి.. ఇద్దరు మోటార్‌బైక్‌లపై పైలెట్‌గా వెళితే వారి కనుసన్నల్లో బియ్యం లారీలు సరిహద్దులు దాటుతన్నాయి.లారీకి రూ.లక్ష వరకు లాభం ఉంటుందని సమాచారం.

అంతటా రేషన్ బియ్యం మాఫియా

- కర్నూలు నగరంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాలో బుదవారపేట, ఓల్డ్ టౌన్‌లో ఉంటున్న ఇద్దరు బియ్యం డాన్‌లదే రాజ్యమని తెలుస్తోంది. కొందరు రేషన్ డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్లు మిగిల్చిన బియ్యం, దళారులు ఇంటింటికి వెళ్లి సేకరించిన రేషన్ బియ్యాన్ని రహస్య గోదాములకు తరలిస్తారు. అక్కడి నుంచి రాత్రివేళ్లలో తుంగభద్ర నది దాటించి కర్ణాటకకు చేరుస్తున్నారు. వైసీపీ హయాంలోనూ.. టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలోనూ వారే హవా కొనసాగిస్తున్నారు.



- ఆదోనిలో వైసీపీ హయాంలో చిన్న బాస్ కనుసన్నల్లో రేషన్ అక్రమ రవాణా సాగిస్తే.. తాజాగా బీజేపీ మాస్క్ వేసుకున్న మాజీ వైసీపీ యువ నాయకుడు రేషన్ బియ్యం డాన్ అవతారమెత్తాడు. ఊరూ వాడా తనదే అంటూ దళారులను పెట్టి సేకరించిన రేషన్ బియ్యంను అర్ధరాత్రి ఆటోల్లో ఆస్పరి రహదారిలోని రహస్య గోడౌన్‌కు చేర్చుతున్నాడు. అక్కడ లారీల్లో లోడ్ చేసి సరిహద్దులు దాటిస్తున్నాడు. ఈ బియ్యాన్ని కర్ణాటకలోని సిరిగుప్ప, రాయచూరు పట్టణాలకు చేరుస్తున్నారని సమాచారం. కొంత బియ్యం రైస్ మిల్లర్ల నుంచి నకిలీ వేబిల్లులు తీసుకొని నేరుగా కాకినాడ పోర్టుకు రవాణా చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.
- ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో పత్తికొండ, డోన్‌కు చెందిన బియ్యం డాన్‌లుగా అవతారమెత్తిన అక్రమార్కులు ఇంటింటా బియ్యం సేకరణ, డీలర్లు వద్ద మిగలిన బియ్యం సేకరించి ఆదోని, డోన్ పట్టణాలకు చేరుస్తున్నట్లు తెలుస్తోంది. డోన్ నుంచి నంద్యాలకు చేర్చి అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నారనే సమాచారం. కోడుమూరులో సైతం బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన మాఫియానే కూటమి ప్రభుత్వంలోనూ రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో కర్ణాటక సరిహద్దుల్లో ఉండడంతో నిఘా కళ్లకు చిక్కకుండా సరిహద్దులు దాటిస్తున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాం

పేదలకు ఇచ్చే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. పలు ప్రాంతాల్లో ఎండీయూ వాహన ఆపరేటర్లే బియ్యానికి బదులుగా నగదు ఇస్తున్నారనే వస్తున్నాయి. వారిపై కూడా నిఘా పెట్టాం. ఏ గ్రామంలోనైనా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నా అక్రమంగా నిల్వ చేసినా జిల్లా పౌర సరఫరాల అధికారులకు సమాచారం ఇస్తే తక్షణమే స్పందించి దాడులు చేస్తాం. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతాం.

- రఘువీర్, కర్నూలు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డులు, బియ్యం కోటా వివరాలు

వివరాలు	కర్నూలు	నంద్యాల	మొత్తం
రేషన్ షాపులు	1,233	1,204	2,4347
ఎండీయూ వాహనాలు	409	352	761
రేషన్ కార్డుదారులు	6,76,206	5,41,804	12,18,010
బియ్యం కోటా నెలకు	11,845	8,655	20,500 (టన్నులు)

'మహనీయుడు అంబేడ్కర్'

బనగానపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లెలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రితో పాటు జేసీ విష్ణుచరణ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ గొప్ప సాంఘిక సంస్కర్త అని మంత్రి బీసీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డీవో నరసింహులు, జిల్లా డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, నియోజకవర్గం స్పెషల్ అధికారి రాంభూపాల్‌రెడ్డి, తహసీల్దారు నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి బీసీ

డాక్టర్ హరికిషన్‌కు మంగాదేవి పురస్కారం



కర్నూలు కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త, కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్‌కు 'మంగాదేవి బాల సాహిత్య పురస్కారం' ఈనెల 10న అందజేయనున్నారు. గుంటూరులోని వెంకటేశ్వర బాలకుటీర్ సంస్థ ఆధ్వర్యంలో ఏటా సాహిత్యంలో వివిధ అంశాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులకు ఈ పురస్కారం, రూ.25 వేల నగదు పారితోషికం అందిస్తున్నారు. కాగా ఈ ఏడాదికి గాను బాల సాహిత్యంలో విశేష కృషి చేస్తూ, యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియాల ద్వారా బాలసాహిత్యాన్ని తెలుగు సాహితీ ప్రపంచానికి అందిస్తున్న డాక్టర్ ఎం. హరికిషన్‌ను ఎంపిక చేశారు. 10న గుంటూరులో ఇస్కాన్ టెంపుల్ రోడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగే బాలకుటీర్ 27వ లలితకళా ఉత్సవంలో, కేంద్ర సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేస్తున్నామని సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ ఎన్. మంగాదేవి తెలిపారు.

డీపీఆర్‌సీలో ముగిసిన శిక్షణ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై డీపీఆర్‌సీలో జరిగిన రెండు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ప్రతి మండలం నుంచి ఈఓఆర్డీ/పంచాయతీ కార్యదర్శి, ఎంపీహెచ్ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హాజరయ్యారు. ఒక్కో మండలం నుంచి 6 మంది బ్లాక్‌లెవెల్ మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారు ఈ నెల 10 నుంచి 13 వరకు ఆయా మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇతర లైన్ డిపార్ట్‌మెంటు అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సీఈఓ నాసరరెడ్డి తెలిపారు.

ఉద్యోగుల వివరాలు ఇవ్వండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగర పాలక, మున్సిపాలిటీలలో అనధికారికంగా సెలవు పెట్టిన ఉద్యోగుల వివరాలను అందజేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ విశ్వనాథ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా సెలవులో వెళ్లిన ఉద్యోగుల వివరాలను ఒక ఫార్మట్‌లో ఇవ్వాలని పేర్కొన్నారు.


విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి

లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు



మాట్లాడుతున్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న విశ్వకర్మ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో విశ్వకర్మ స్కీంపై రాజకీయ పార్టీలకతీతంగా అవగాహన సదస్సును దేవపూజ ధనుంజయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ విశ్వకర్మ పథకం ద్వారా రుణం పొంది అభివృద్ధి చెందాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు అర్హులు అన్నారు. విశ్వకర్మ పథకానికి ఎన్నికైన వారు బ్యాంకు ద్వారా ఈ రుణాలు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ స్కీంలో వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, రాతి శిల్పి, చెప్పులు కుట్టేవారు, బొమ్మలు తయారు చేసేవారు, మంగలి వృత్తి వారు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. రుణ సౌకర్యం రూ.10 లక్షలలోపు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఐపీవో హరి, కర్నూలు పట్టణ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మి, మెప్మా అధికారి భాస్కర్ రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీనాయుడు, బీసీ నాయకులు శ్రీరాములు యాదవ్, బెస్త ఈరన్న, అయ్యన్న యాదవ్ పాల్గొన్నారు.



అపార్ ఆపసోపాలు

విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో తేడాలు
ఆధార్‌లో ఒకలా.. రికార్డులో మరోలా
ఒత్తిడి గురవుతున్న ఉపాధ్యాయులు



ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జాతీయ స్థాయిలో ఒక జీవితకాల గుర్తింపు కార్డు జారీ చేయాలని కేంద్రం సూచించింది. అందులో భాగంగా ఆటోమెటిక్ పర్మనెంట్ అకౌంట్ రిజిస్ట్రే(అపార్) 12 అంకెలు కూడిన కార్డును జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే పాఠశాలలో అపార్ జారీకి ఉపాధ్యాయులు ఆపసోపాలకు గురవుతున్నారు. విద్యార్థుల వ్యక్తిగత వివరాలలో తేడాలు ఉండడంతో తలలు పట్టుకుంటున్నారు. విద్యార్థుల ఆధార్ కార్డులో ఒకలా.. స్కూలు రికార్డులో మరోలా ఉండడంతో అపార్ నమోదుకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓ వైపు విద్యాశాఖ ఒత్తిడి చేస్తుండడంతో విద్యార్థులు ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఆధార్ కేంద్రాల్లోనూ సరైన ఆధారాలు లేవని వెనక్కి పంపిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఆదోని నియోజకవర్గంలో 274 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 64,870 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ అపార్ జారీ చేయాలని ప్రభుత్వం సూచించింది. అందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల స్కూలు రికార్డులను బట్టి ప్రభుత్వం పెట్టిన ప్రత్యేకమైన యాప్‌లోవారి వివరాలను నమోదు చేస్తున్నారు. చాలా మంది విద్యార్థుల వివరాల్లో తేడాలు ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓ వైపు సాంకేతిక సమస్య.. మరోవైపు జిల్లా విద్యాశాఖ అధికారులు త్వరగా పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటి వరకు 47,934 మంది విద్యార్థులకు మాత్రమే అపార్ నమోదు చేశామని చెప్పుతున్నారు. 74 శాతం పూర్తయిందని అధికారులు పేర్కొంటున్నారు.

- ఆర్ఆర్‌లేబర్ కాలనీలోని పాఠశాలలో 954 మంది విద్యార్థులు చదువుతుండగా ఇప్పటి వరకు 550 మంది విద్యార్థులకు అపార్ నమోదు చేశారు. కొంతమంది విద్యార్థుల ఇంటి పేర్లు, పుట్టిన తేదీలు తల్లిదండ్రుల ఆధార్‌లో వేరేలా ఉండడం వల్ల 58 శాతం మాత్రమే పూర్తయింది.
- నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 1850 మంది చదువుతుండగా 1500 మంది విద్యార్థుకు అపార్ నమోదు చేశారు.
- మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1600మంది విద్యార్థులు చదువుతుండగా 1450 మందికిపైగా విద్యార్థులకు అపార్ జారీ చేశారు. మిగతా విద్యార్థులు వారి వివరాలు తప్పుగా ఉండడంతో సరి చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు.



ఆర్ఆర్ లేబర్ కాలనీలో అపార్ కోసం వివరాలను నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

ప్రతి విద్యార్థికి అపార్ జారీ : శ్రీనివాసులు, ఎంఈవో ఆదోని



పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి అపార్ జారీ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఏమైనా తప్పులు ఉంటే వెంటనే సరి చేసుకునే అవకాశం కూడా కల్పించింది. విద్యార్థికి జీవిత కాలం ఒకే నెంబర్ ఉండేలా జారీ చేసిన కార్డు. ఉపాధ్యాయులు త్వరగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరొకరికి గాయాలు



ప్యాపిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాంపల్లి చెరువు దగ్గర 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామానికి చెందిన రాజు(20), అరవింద స్నేహితులు కలిసి పని నిమిత్తం బైకుపై డోన్‌కు వెళ్లారు. అక్కడ పని పూర్తి కాగానే తిరిగి పెద్దపూదిళ్లకు బయలుదేరారు. మార్గం మధ్యలోని వెంగళాంపల్లి చెరువు దగ్గరకు రాగానే అదుపు తప్పి బైకు బోల్తా పడింది. ఈ ఘటనలో రాజు అక్కడికక్కడే మృతి చెందగా అరవిందుకు గాయాలయ్యాయి. మృతుడి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పారిశ్రామిక అభివృద్ధికి సహకారం

కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా పారిశ్రామికాభివృద్ధికి కెనరా బ్యాంకు సహకారం ఉంటుందని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్‌కు సమీపంలోని ఉద్యమి భవన్‌లో కెనరా బ్యాంకు రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరగతి పరిశ్రమల స్థాపనకు సంబంధించిన రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం సుశాంత్ కుమార్ మాట్లాడుతూ కెనరా బ్యాంకు 54 శాఖలతో కర్నూలు జిల్లాలో విస్తృత సేవలు అందించడమే కాకుండా, ఎంఎస్ఎంఈ రంగానికి రుణాలు అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక రుణాలు, రైతులకు అవసరమైన పెట్టుబడుల కోసం ప్రత్యేక పథకాలు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎంఎస్ఎంఈ రుణాలను వినియోగించుకొని తమ వ్యాపార అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సులబ్ కార్యాలయం అధికారులు రమేష్ ప్రభు, రీజిల్ కార్యాలయం అధికారి జి. నరేష్, బ్యాంకు సీనియర్ మేనేజర్లు, ఇతర బ్యాంకుల అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

ఎస్పీ జి. బిందుమాధవ్ ● ఘనంగా హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం

కర్నూలు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజసేవ, శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల సేవలు ప్రశంసనీయమని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో 62వ హోంగార్డుల వ్యవస్థాపక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ హోంగార్డుల నుంచి ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనంపై వెళ్లి ప్లటూన్లను పరిశీలించారు. బెలూన్లు, కపోతాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే నేరుగా కలిసి విన్నవిస్తే పరిష్కరిస్తామన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా సమష్టిగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్‌లో మంచి మార్కులు సాధించిన ఆరుగురు హోంగార్డు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. అలాగే లాంగ్‌జంప్ షాట్‌పుట్, వంద మీటర్ల క్రీడల పోటీల్లో గెలుపొందిన హోంగార్డ్స్ విజేతలకు జిల్లా ఎస్పీ బహుమతులు ప్రధానం చేశారు. 33 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం.మహేష్ కుమార్, ఏఎస్పీలు హుశేన్‌పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు బాబు ప్రసాద్, ప్రసాద్, పోలీస్ వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి, స్పెషల్ బ్రాంచ్ సీఐ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

నంద్యాలలో...

నంద్యాల క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం 62వ హోంగార్డు దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సేవలందించిన హోంగార్డులను ఎస్పీ అభినందించారు. అనంతరం హోంగార్డులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఎన్.యుగంధర్‌బాబు, చంద్రబాబు, డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో శ్రీశైలం ఈవో




ఈవో శ్రీనివాసరావును ఆలయ మర్యాదలతో సత్కరిస్తున్న అర్చకులు, అధికారులు

మహానంది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శ్రీశైలం ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఈవోకు ఆలయం వద్ద వీరికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఈవో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలను జరిపారు. కల్యాణ మంటపంలో వేదపండితులు, ప్రధాన అర్చకుడు మామిళ్ళపల్లి అర్జునశర్మ ఈవోను శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట శ్రీశైలం పీఆర్వో టి.శ్రీనివాసరావు, మహానంది ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి, సిబ్బంది నీలకంఠరాజు, నాగమల్లయ్య పాల్గొన్నారు.

మహానందిలో మళ్లీ చిరుత సంచారం

మహానంది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలో మళ్లీ చిరుత పులి సంచరించడంతో భక్తులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కొంత కాలం నుంచి చిరుతపులి సంచారం లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దైవ దర్శనం కోసం వచ్చిన అయ్యప్ప భక్త బృందంలోని కొందరు కాల కృత్యాలు తీర్చుకునేందుకు ఆలయం వెనుక వైపునకు వెళ్లారు. చిరుతపులి సంచరించడం గమనించి కేకలు వేస్తూ పరుగులు తీశారు. అలాగే మహానంది పరిసరాల్లోని పార్వతీపురం శివారు వైపు కూడా చిరుత అర్ధరాత్రి సంచరించినట్లు స్థానికులు తెలిపారు. కొన్ని నెలల నుంచి చిరుతపులి కదలికలు మహానంది ఆలయ పరిసరాల్లో లేకపోవడంతో ప్రశాంతంగా ఉన్న స్థానికులు మళ్లీ చిరుత సంచారంతో ఆందోళన చెందుతున్నారు.



ఆలయ పరిసరాల్లో చిరుత

నాణ్యమైన విత్తనాలు అందజేస్తాం

-ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యమని రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం కడప సీనియర్ నాయకులు పుత్త నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణచైతన్యరెడ్డిలను వారి కార్యాలయాల్లో ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు అందించిన విత్తనాలు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రైతులకు అందిస్తున్న విత్తనాలు నాణ్యత, సరఫరాపై వారితో సుబ్బారెడ్డి చర్చించారు. అనంతరం వారి నుంచి పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో శ్యామూల్ పాల్ శుక్రవారం తెలిపారు. ఈ పరీక్ష 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించరని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3865 మంది హాజరు కానున్నారని తెలిపారు. రెండు డివిజన్‌లో 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రెండు స్క్వాడ్ బృందాలు, 18 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తారన్నారు.



వర్షంతో రైతుల గుండెల్లో గుబులు

మిడుతూరు మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. వర్షాలకు తోరణాలు కట్టిన పొగాకు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. గాలి వాన కారణంగా తోరణాలపైన వేసిని పట్టలు లేచి పొగాకు తడిసి దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. **-మిడుతూరు**



రాజ్యాంగ నిర్మాతకు నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ రంజిత్ బాషా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలను ఆయన కొనియాడారు. **-కర్నూలు కలెక్టరేట్**

కోసిగయ్య స్వామి గర్భగుడికి తాళం



ఆలయానికి వేసిన తాళాలు

కోసిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోసిగి గ్రామ దేవునిగా భక్తులతో పూజలందు కుంటున్న కోసిగయ్య (ఆంజనేయ)స్వామి ఆలయానికి కొందరు వ్యక్తులు తాళాలు వేయడంతో భక్తులు, పెళ్లి వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయంలో అర్చకునిగా పని చేస్తున్న పూజారి శ్రీరాములు, శ్రీనివాసులు ఎప్పటిలాగే తాళం తీయడానికి ఆలయానికి వచ్చారు. అయితే అదనంగా మరో తాళం ఆలయ గర్భగుడికి వేసి ఉండటంతో వారు కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాళం వేసిన వారిలో గతంలో ఆలయ అర్చకులుగా పని చేసిన గోపాల్, ప్రసాద్ కుటుంబ సభ్యులే ఉన్నట్లు తెలిసింది. సమస్య ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలిగాని తాళం వేయడం ఏమిటి అని భక్తులు మండిపడుతున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే బ్రాహ్మణుల సంక్షేమం

కర్నూలు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని బ్రాహ్మణ సంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు గతంలో ఇచ్చిన సబ్సీడి రుణాలతో పాటు విదేశీ విద్య, విద్యార్థులకు ఉపకార వేతనాలు తదితర సంక్షేమ పథకాల కోసం రూ. 270.61 కోట్ల నిధులు కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి సవితకు బ్రాహ్మణుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో చాణక్య, కశ్యప, గాయత్రి, వశిష్ఠ, ద్రోణాచార్య, విదేశీ విద్యా పథకాలను పునరుద్ధరించి బ్రాహ్మణులను ఆదుకోవాలని కోరారు.

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

హాజరైన మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ టెక్స్‌టైల్స్, జ్యూవెలరీ షాపింగ్ మాల్‌ను శుక్రవారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో సీఎంఆర్ లాంటి షాపింగ్ లాంటి పెద్దమాల్స్ రావడంతో అభినందనీయమన్నారు. దీంతో నంద్యాల పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ వెంకటరమణ మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా సంస్థను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. తమ 39వ షోరూంను నంద్యాలలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అన్ని రకాల వేడుకలకు తమ సంస్థలో వస్త్రాలు అతి తక్కువ ధరకే లభిస్తాయన్నారు. తమ సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్‌లో మరెవ్వరూ ఇవ్వనిధరలకు అందిస్తుందన్నారు. సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ సీఎంఆర్ అంటే ది వన్ స్టాప్ షాప్ అన్నారు. అన్ని రకాల వెరైటీలు, డిజైన్స్‌లు లభిస్తాయన్నారు. అందరికి అందుబాటు ధరలో లక్షలలో డిజైన్లు,వేలల్లో వెరైటీలు లభిస్తాయన్నారు. యువతరానికి నచ్చేవిధంగా వస్త్ర ఉత్పత్తులు ఉంటాయని తెలిపారు.



అభిమానులతో సెల్ఫీ తీసుకుంటున్న సినీనటి కృతిశెట్టి



షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, మాల్ యాజమాన్యం

ప్రత్యేక ఆకర్షణగా సినీతార కృతిశెట్టి

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ప్రముఖ సినీనటి కృతిశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆమె షాపింగ్ మాల్‌లోని అన్ని సెక్షన్లు తిరిగి అన్ని రకాల వస్త్రాలను పరిశీలించారు. అన్ని రకాల వస్త్రాల క్వాలిటి చాలా బాగుందన్నారు. అభిమానులతో సెల్ఫీలు దిగి, డ్యాన్స్ చేసి అభిమానులను ఉర్రూతలూగించారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం మార్గంలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం ఆయన పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరిలతో కలిసి ఆగిపోయిన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఇదివరకే ఎమ్మెల్యే పలుమార్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టరేట్‌లో మీటింగ్‌కు విచ్చేసిన మంత్రి రోడ్డు వైడింగ్ పనులను పర్యవేక్షించి త్వరగా పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ నవ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఆర్డీఓ, ఆర్‌అండ్‌బీ అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించండి

కర్నూలు కలెక్టరేట్: నంద్యాల చెక్‌పోస్టు నుంచి ఆత్మకూరు వైపు వెళ్లే రోడ్డులో ఉన్న కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌ను షిఫ్టు చేయించాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల చెక్‌పోస్టులో జరిగిన రోడ్డు ప్యాచ్ వర్కులను ఎన్‌హెచ్ రోడ్డుకు సంబంధించిన పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల చెక్‌పోస్టు నుంచి ఆత్మకూరు వైపు వెళ్లే రోడ్డుకు అడ్డంగా ఉన్న కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోక చోటుకు షిఫ్టు చేయించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

గ్రామాభివృద్ధే టీడీపీ ధ్యేయం: మల్లెల



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.15లక్షల సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓర్వకల్లు మండలానికి రూ.2కోట్ల నిధులతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీలు, గోకులాల షెడ్లు నిర్మిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో ఒక్క సిమెంటు రోడ్డు కూడా వేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రజాక్‌బాషా, మహబూబ్ బాషా, ఖాదర్‌బాషా, సలాం, షా పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఓర్వకల్లు, డిసెం బరు 6(ఆంధ్ర జ్యోతి): మండ లంలోని కన్నమడకల గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన బోయ వెంకటలక్ష్మమ్మ(55) సాయంత్రం తన ఇంట్లో విద్యుత్ మోటారు ఆన్ చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. సాయంత్రం వర్షం పడటంతో మోటారు ప్లగ్ వైరుకు తేమ తగిలి విద్యుత్ ప్రవహించడం వల్లే ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఓర్వ కల్లు విద్యుత్ శాఖ ఏఈ సునీల్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం గురించి ఆరా తీశారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు కోరారు.

తేలు కాటుతో ఇద్దరికి అస్వస్థత

ఓర్వకల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం 6వ తరగతి చదువుతున్న నిర్మల జ్యోతి, నవజ్యోతి అనే విద్యార్థినులకు తేలు కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో శనివారం జరిగే కార్యక్రమం కోసం ఆ విద్యార్థినులు రాయి కోసం వెళ్లారు. రాయిని తీస్తుండగా.. వీరిని తేలు కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న కోరారు. ఆయన ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు.

రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై కాలు చితికిపోయి ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓ రోగికి గురువారం అర్ధరాత్రి కర్నూలు జీజీహెచ్ ఆర్థో వైద్యులు ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన సయ్యద్ షబ్బీర్ (52) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రరక్తస్రావంతో కాలు ఛిద్రమైపోయింది. గురువారం రాత్రి 10 గంటలకు కర్నూలు జీజీహెచ్ క్యాజు వాల్టీకి వచ్చారు. రోగి గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు కు సమాచారం రావడంతో ఆయన క్యాజువాల్టీకి చేరుకున్నారు. స్వతాహాగా ఆర్థోపెడిక్ వైద్యుడు రావడంతో సూపరింటెండెంట్ రోగి అత్యవసర పరిస్థి తిని శస్త్ర చికిత్స అవసరాన్ని గుర్తించి అక్కడ డ్యూటీలో ఆర్థోపెడిక్ అసిస్టెట్ ప్రొఫెసర్ డా.పి.శివకుమార్ వెంటనే ఆపరేషన్ చేయాలని ఆదేశించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆర్థో యూనిట్-4 వైద్యులు డా.పి.శికుమార్ నేతృత్వంలో రోగికి ఆపరేషన్ చేశారు.

వంకను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు సర్వే నెంబరు 128లో వడ్లోని వంకను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రామకృష్ణ కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం పెద్దపాడులో చేపట్టిన రెవెన్యూ గ్రామసభలో ఆయన వడ్లోని వంకను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమిం చుకోవడంతో వంకలో పోవాల్సిన వరదనీరు ఎస్సీ కాలనీ, హాస్టల్‌లోకి వెళ్తున్నాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మర్మమతు పనుల్లో భాగంగా నగరంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి. శేషాద్రి తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు పవర్‌హౌస్ సెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో కరెంట్ కోత ఉంటుందన్నారు.

9న ఆర్చరి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బి.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 9న జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి కే.నాగరత్నమయ్య శుక్రవారం తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9393855546ను సంప్రదించాలన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

కర్నూలు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమాజానికి చేసిన కృషి మరువలేనిదని ఉపకులపతి షావలి ఖాన్ అన్నారు. శుక్రవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి వీసీ షావలి ఖాన్, రిజిస్ట్రార్ లోకనాథ్‌లు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా, డాక్టర్ పాల్ కృపాకర్, బి. వెంకటప్ప , విద్యార్థులు పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీలో అంబేడ్కర్ చిత్రపటానికి ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సీవీ కృష్ణారెడ్డి, ఎన్ నరసింహులు, డీన్స్ సుందరానంద పుచ్చా, ఆర్ భరత్ కుమార్ పాల్గొన్నారు.

● జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు నాగరాజు యాదవ్, ధరూర్ జేమ్స్, కె.తిరుపాల్, నాగశేషులు, బేతం కృష్ణ, విజయ్ గౌడ్ పాల్గొన్నారు.

● జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, బతుకన్న, షేక్ ఖాజా హుస్సేన్, అనంత రత్నం మాదిగ, లాజరస్, ప్రమీల పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి డా.కేవిశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, ఆర్ఓ జునైద్ పాల్గొన్నారు.

● వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుభాష్‌చంద్ర బోసు, కిషన్, షరీఫ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచ్చబండ సేవా సమితి ఆధ్వర్యంలో పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు వి.శ్రీనివాసులు, దశరథరామనాయుడు, నరసింహులు, బాబురావు పాల్గొన్నారు.

● దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవనంలోని అంబేడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్ర, శ్రీనివాసులు, బీసన్న, కోటమ్మ పాల్గొన్నారు.

● మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ నగర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ధరూర్ గోపి, యాకోబు పాల్గొన్నారు.

● కులవివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో 43వ వార్డులో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ టి.రాముడు, భాస్కర్, రోశయ్య పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా వృత్తివిద్యా అధికారి వై.పరమేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ డా.నాగస్వామి నాయక్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ జూనియర్ టౌన్‌మోడల్ కళాశాలలో అంబేడ్కర్ చిత్ర పటానికి ప్రిన్సిపాల్ సుంకన్న పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు జల గంగాధర్, బాల నారాయణ, రాజు నాయక్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: పాతనగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ ఉద్యోగులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉద్యోగులు మక్బుల్ బాషా, రాజు పాల్గొన్నారు.

● 43వ వార్డు ఇందిరాగాంధీనగర్‌లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. కార్పొరేటర్లు నరసింహులు, మునెమ్మ, సుంకన్న పాల్గొన్నారు.

కర్నూలు రాజ్‌విహార్: సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి విద్యార్థి సంఘాల నాయకులు కోనేటి వెంకటేశ్వర్లు, కె. వెంకటేశ్, పి.రాజీవ్‌కుమార్, కటికె గౌతమ్, దత్తు యాదవ్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కర్నూల లీగల్: పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి సీనియర్ న్యాయవాది, నేషనల్ లాయర్స్ ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు వై.జయరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాదులు మాదన్న, రవికాంత్ ప్రసాద్, సుబ్బయ్య, నిత్యజీవరాజు, నాగముని పాల్గొన్నారు.

● బార్ అసోసియేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి న్యాయవాదులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాది వై.జయరాజు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కర్నూలు అగ్రికల్చర్: కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి పూలమాల వేసి నివాళుల ర్పించారు. మార్కెట్ కమిటీ సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ పాల్గొన్నారు.







అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీవీఈవో పరమేశ్వరరెడ్డి, నగర పాలక సంస్థ కార్యాలయంలో.. బార్ అసోసియేషన్ కార్యాలయంలో



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



టీడీపీ కార్యాలయంలో..



రాయలసీమ యూనివర్సిటీలో..

సి.బెళగల్: కొత్తబస్టాండు ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల ఎంఆర్‌పీఎస్ నాయకుడు నాగరాజు, మాజీ మండల టీడీపీ కన్వీనర్ తిమ్మప్ప, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, విష్ణుసేన హమాలీ యూనియన్ నాయకుడు భీమన్న, బాలాజివెంకటేశ్ పాల్గొన్నారు.

గూడూరు: గూడూరులో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, నాయకులు సృజన్, రేమట వెంకటేష్, పౌలు, కౌన్సిలర్ బుడ్డంగలి, రామాంజనేయులు, నాగప్ప యాద వ్, వాహిద్, ఎస్ఈ భాస్కర్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కోడుమూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ప్యాలకుర్తిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో డిప్యూటీ కలెక్టర్, ఏడీఏ సాలురెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్, ఎంపీడీవో రాముడు హాజరయ్యారు. రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు.

ఓర్వకల్లు: గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య, తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మీదివేముల గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో 54 మంది రైతుల నుంచి అర్జీలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనె 9వ తేదీన నన్నూరు, 10న ఓర్వకల్లు, 11న పూడిచెర్ల, 12న కాల్వ, 13న బ్రాహ్మణపల్లె, 16న కొమరోలు, 17న ఉప్పలపాడు, 18న లొద్దిపల్లె, 19న కేతవరం, 20న గుట్టపాడు, 21న ఎన్.కొంతలపాడు, 23న హుశేనాపురం, 24న పాలకొలను, 26న తిప్పాయపల్లె, 27న శకునాల, 28న సోమయాజులపల్లె, 30న ఉయ్యాలవాడ, 31న కన్నమడకల, జనవరి 2న బైరాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీ ల్దార్ తెలిపారు.

గూడూరు: రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని చనుగొండ్ల గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. మండల ఇన్‌చార్జి ఆఫీసర్ సబియా పర్వీన్, మండల సర్వేయర్ బాలు నాయక్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్, ఏడీఏ

సి.బెళగల్: రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మట్లాడుతూ సీఎం చంద్రబాబు రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. ఈసమావేశంలో మం డల ప్రత్యేక అధికారి సంధ్యరాణి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీ డీవో రాణెమ్మ, మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, ఎంపీటీసీ ఈరన్నగౌడు, మాజీ ఎంపీటీసీ ధనంజయుడు, యాకోబు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న షాదీఖానాను ఎమ్మెల్యే దస్తగిరి శుక్రవారం పరిశీలించారు.

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బి.తాండ్రపాడు డైట్ కాలేజీలో శుక్రవారం కళా ఉత్సవ్ పోటీలు ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ షంషుద్దీన్ ప్రారంభించారు. ఆరు విభాగాల్లో 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వీరు రాష్ట్ర జాతీ య స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలుగా ఓకల్ మ్యూ జిక్‌లో మొదటి విజేతగా జి.తేజశ్రీ, రెండో విజేతగా ఎం.అశ్విని, మూడో విజేతగా వి.వర్షితలు నిలిచారు. అలాగే ఓకల్ మ్యూజిక్ సాంప్రదాయ జానపదాల్లో కీర్తన, బృందం మొదటి విజేతగా నిలిచింది. ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ పెక్యూసిస్ పావని, ప్రణీ, ఎం.నాగసాయి నిలిచారు. ఇన్‌స్ట మెంటల్ మెలోడిక్‌లో పావని బృందం నిలిచింది. క్లాసికల్ డ్యాన్స్‌లో ఎం. జగదీష్, పావని ఎం.గీతికలు ఉన్నారు. జానపద నృత్యంలో మల్లికార్జున బృందం, అమల్ బృందం, ఫామియా బృందం నిలిచింది. థియేటర్‌మోనో, మిమిక్రీలో జి.జసికా, విజువల్ ఆర్ట్ ద్విమితీయ త్రిమితీయంలో జి.ధర్మ తేజలు నిలిచారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



జిల్లా న్యాయాధికారికి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సుప్రీం కోర్టు, హైకోర్టు, అన్ని జిల్లాల కోర్టుల్లో ఏర్పాటు చేయాలని సీనియర్ న్యాయవాది ఎం.సుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా బహుజన లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా న్యాయాధికారి కబర్దిని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు తిరుపతయ్య, కె.ప్రభాకర్, రాజేష్, ఎం.జగదీష్‌బాబు, మౌలాలి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): టిడ్కో భవన సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో టిడ్కో భవన సముదాయంలో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమవా రం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టిడ్కో ఇళ్ల కేటాయించలేదని, మౌలిక వసతులు కల్పించాలని పలువురు అర్జీలు ఇస్తున్నారన్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టిడ్కోలోనే ఇళ్లు మంజూరైన వారికి అక్కడే రేషన్ అందజేయడానికి వీలుగా కొత్త రేషన్ షాపు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే నుంచి టిడ్కో కాలనీ అప్రోచ్ రోడ్డుకు యుటర్న్ లేకుండా వెళ్లేందుకు గల వీలును పరిశీలించాలని నేషనల్ హైవే అధికారులకు ఒక లేఖ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అదేవిధంగా అక్కడ అంగన్‌వాడీ కేంద్రం, పాఠ శాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, ఈఈ సూర్యనారాయణ, డీఈ రవికుమార్ గుప్తా పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి 'ప్రీమియం హోండా'



ప్రీమియం హోండా నూతన కారుతో కెనరా బ్యాంకు ఆర్ఎం సుశాంత్ కుమార్, హోండా సంస్థ ఎండీ నివేదితా రెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్ల ఉత్పాదక సంస్థ ప్రీమీయం హోండా తన నూతన మోడల్ 'ఆల్ న్యూ అమెజ్' కారును శుక్రవారం జిల్లా మార్కెట్‌లోని విడుదల చేసింది. కర్నూలులోని ఆ సంస్థ అధీకృత డీలర్ ప్రీమియం హోండా షోరూమ్‌లో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమలో కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి, నూతన కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రీమియం హోండా సంస్థ ఎండీ నివేదితా రెడ్డి మాట్లాడుతూ ఆధునిక కాలానికి అనుగుణంగా, మూడో జనరేషన్ వాహనం అయిన ఆల్ న్యూ అమెజ్ అత్యాధునిక సౌకర్యాలతో వినియోగదారులకు అందుబాటులోకి వచ్చిందని అన్నారు. వాహనంలోని ఇంటీరియల్‌తోపాటూ భద్రత విషయం లోనూ ప్రత్యేక వసతులు ఉన్నాయని చెప్పారు. మాన్యుయల్, ఆటోమేటిలలో మూడు వేరియంట్లలో ఈ వాహనాలు అందుబాటులో ఉన్నాయని, ప్రారం భ ధర రూ.7.99 లక్షలుగా ఉందని అన్నారు. సంస్థ ఏజీఎం బాబావలి, సీనియర్ జీఎం క్రిష్ణారెడ్డి, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం ఇన్‌చార్జి సెక్రటరీగా రెహమాన్

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ కమిటీలో సెక్రటరీగా పని చేస్తున్న రెహమాన్‌ను పాణ్యం ఇన్‌చార్జి సెక్రటరీగా నియమిస్తూ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రెహమాన్‌ను కర్నూలు మార్కెట్ కమిటీసెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అదనపు సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్, అకౌంటెంట్ కిషన్ రెడ్డిలు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా రెహిమాన్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వాచ్‌మన్ సస్పెండ్

సి.బెళగల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించిన బీసీ హాస్టల్ వాచ్‌మన్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మండల కేంద్రమైన సి.బెళగల్ బీసీ హాస్టల్‌లో జనార్ధన్‌గౌడు వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం జిల్లా అధికారులు హాస్టల్‌ను ఎంపీడీవో రాణెమ్మ, ఎంఈవో ఆదాంబాషాలు తనిఖీ చేయగా మద్యం సేవించి నిద్రపోయాడు. ఈవిషయాన్ని వార్డెన్ రాముడు జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

గూడూరు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి డాక్టర్ మన్నన్‌బాషా అన్నారు. శుక్రవారం గూడూరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మన్నన్ బాషా మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదుతో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని అన్నారు.

జీజీహెచ్‌లో పందుల సంచారం...

సిబ్బందిపై సూపరింటెండెంట్ ఆగ్రహం



పెద్దాసుపత్రిలో రౌండ్స్ నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో ఎక్కడ పడితే అక్కడ పందులు తిరుగుతున్నాయని సెక్యూరిటీ గార్డులపై సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాల్లో రౌండ్స్ నిర్వహిం చారు. ఆసుపత్రిలో పందులు ఉండటం ఏమిటనీ, అసలు పందులను వదలకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. పందులను నివారించడానికి ప్రయత్నిస్తే కొందరు యజమానులు దాడులు చేస్తారని సెక్యూరిటీ గార్డులు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని కర్నూలు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్తానని, ఆసుపత్రిలో మూడు రోజుల్లో పందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

ఉపాధ్యాయురాలికి ఆర్థిక సాయం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) కర్నూలు శాఖ ఆధ్వర్యం లో పాతనగరంలోని వివేకానంద సంస్కృత పాఠశాల ఉపాధ్యాయురాలు సి.శకుంతలకు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం ఆవోపా అధ్యక్షుడు మేడా వెంకట సురేష్, కోశాధికారి పురుషోత్తంలు పాఠశాలలో రూ.5,500 చెక్కును ఆమెకు అందజేశారు. హెచ్ఎం నీల వేణి, ఎస్‌జేటీ సుబ్బలక్ష్మయ్య పాల్గొన్నారు.

కాలనీల్లో రోడ్లను నిర్మించాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు కాలనీల్లో రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్ష ణమే రోడ్లు నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ రహదారి పక్క నే ఉన్న విష్ణుటౌన్‌షిప్‌ను సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భం గా పుల్లారెడ్డి మాట్లాడుతూ విష్ణుటౌన్‌షిప్‌లో 60 అడుగుల రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉందన్నారు. అపార్ట్‌మెంట్ల అసోసియేషన్ల ప్రతినిధులు కేవీ మల్లికార్జున, వీ రామిరెడ్డి, ముస్తఫా, ఎం.బల రామిరెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్ర మానికి ఎస్ఐ హుశేన్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, దస్తగిరిరెడ్డి, ఖలందర్‌భేగ్‌లు శుక్రవారం హాజరై బాస్కెట్‌బాల్ జిల్లా స్త్రీ, పురుషుల జట్లకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ముస్తహీర్, కొండేపోగు చిన్న సుంకన్న, కాశీరావు పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో సాయిగీతికకు మూడో స్థానం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 3 నుంచి 5 తేదీ వరకు జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల విలువిద్య పోటీల్లో కర్నూలు చెందిన సాయిగీతిక ప్రతిభ కనబరిచి మూడో స్థానం సాధించారు. ఈ నెల 14 నుంచి 20 వరకు జమ్‌షేడ్‌పూర్ టాటా నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు సాయిగీతిక అర్హత సాధించినట్లు రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నాగరత్నమయ్య తెలిపారు. ఈ సందర్భంగా సాయిగీతికను అభినందించారు.

ఓపీలో మళ్లీ కష్టాలు..

● మొరాయించిన సర్వర్
● గంటల తరబడి క్యూలైన్లలో రోగులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మళ్లీ ఓపీకి కష్టాలు మొదలయ్యాయి. శుక్రవారం ఉద యం 10.20 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ-హాస్పిటల్ సైట్ సర్వర్ మొరాయించింది. గంటకు పైగా సర్వర్ పని చేయకపోవడంతో కర్నూలు జీజీహెచ్‌లో ఓపీ కౌంటర్ల వద్ద రోగులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. దీంతో ఆసుపత్రి అధికారులు ఓపీలను చేతి రాతతో రాసి ఇవ్వాలని ఆదేశించడంతో సిబ్బంది ఓపీ చీటిలను ఇవ్వడం ప్రారం భించారు. రోగులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడలేక నరక యాతన అనుభవించారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి

● ఆర్డీవో భరత్‌నాయక్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి



హోసూరు రెవెన్యూ సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న జడ్పీ సీఈవో

పత్తికొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మీకు సంబంధించిన భూసమస్యలు ఎలాంటివైనా మీగ్రామంలో నిర్వహించే రెవెన్యూసదస్సులో అర్జీగా అధికారులకు అందించాలని ఆర్డీవో భరత్‌నాయక్, జడ్పీ సీఈవో నాసరరెడ్డిలు అన్నారు. పత్తికొండ మండలపరిధిలోని హోసూరులో తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును వారు వేరువేరుగా పరిశీలించారు. ప్రజలనుండి మొత్తం 7అర్జీలు అందాయని వాటిని పరిశీలించి వారికి న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో మండల, గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

మద్దికెర: రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, హార్టికల్చర్ పీడీ ప్రత్యేక అధికారి ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో రెవెన్యూ సదస్సుల్లో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని అన్నారు. రైతుల సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే పరిష్కరించే విధంగా చూస్తామని తెలిపారు. రైతులకు సంబంధించిన 1బీ అడంగల్ వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రైతుల క్రయవిక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే పాస్‌బుక్‌ల కోసం దరఖాస్తు ఫారాలను రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుశేన్ సాహెబ్, వీఆర్వోలు బాలవర్ధన్, మల్లికార్జున, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, ఆర్ఐ రవికుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఆలూరు తహసీల్దార్ గోవింద సింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మనేకుర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ బసవన్న గౌడ్ సర్పంచ్ కొల్లమ్మ, సర్వేయర్ అరుణ జ్యోతి వీఆర్‌వోలు రవికుమార్ ఆనంద్, వన్నూర స్వామి, టీడీపీ నాయకులు డీలర్ వెంకటేశ్వరులు, దేవేంద్ర పాల్గొన్నారు.

హాలహర్వి: గ్రామాల్లో రెవెన్యూపరంగా భూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ నజ్మబాను అన్నారు. శుక్రవారం సిద్దాపురం, బల్లూరు, అమృతాపురం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు ఇచ్చిన ధరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, ఆర్ఐ మహేష్ పాల్గొన్నారు.

హోళగుంద: ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మండలం స్పెషల్ ఆఫీసర్ డీపీవోజీ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ నిజాముద్దీన్ అన్నారు. శుక్రవారం చిన్న హ్యట గ్రామలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో 7 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ చక్రవర్తి, ఎండోమెంట్ అధికారి నరేంద్ర, సర్పంచ్ యేసన్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ, ఎస్ తిమ్మాపురం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్ ,తహసీల్దార్ లోకేశ్వరయ్య పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: రెవెన్యు సదస్సుల ద్వారా రైతుల భు సమస్యలను పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మన్ రాజు,కర్నూల్ పార్లమెంట్ టీడీపీ లీగల్ సెల్ ప్రదాన కార్యదర్శి మాదాపురం ఎల్వీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం అమకతాడు గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంతు,సుధాకర్,హనుమంతు,విఆర్వో శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: రెవెన్యూ సదస్సుతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తంగరడోన గ్రామంలో తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో భూ సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సతీష్ కుమార్, యుగంధర్, మల్లేష్, నారాయణ, శేషాద్రి నాయుడు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగులలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ సుధాకర్, తహసీల్దార్ రమాదేవి, అధికారులు రైతులతో అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఈవో వీరయ్య, సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు వెంకట్రాముడు, రెహిమాన్, సర్పంచ్ చౌడప్ప, ప్రతాప్ యాదవ్ ఉన్నారు.

'టీడీపీ నాయకుడి మృతి తీరని లోటు'

తుగ్గలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ యలమంచిలి శ్రీరాములు మృతి పార్టీకి తీరని లోటు అని టీడీపీ మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి, సీనియర్ నాయకులు అప్పావేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పర్లపల్లిలో శ్రీరాములు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడు, టీడీపీ నాయకులు రమేష్, మనోహర్, విద్యాకమిటీ ఛైర్మన్ కంబగిరి ఉన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి) : కుంభలూరు గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరాం డిమాండ్ చశారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కౌతల మండలం కుంభలూరు గ్రామానికి చెందిన మాల కృష్ణయ్య, ఈరన్న, లలితమ్మ, తాయమ్మ కుటుంభ సభ్యులపై అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణాలైన బసవన్న గౌడ్, ముద్దే గౌడ్, మహాదేవతో పాటు మరికొందరు దాడి చేసి గాయపరిచారన్నారు. వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్ కుమార్, చంద్రశేఖర్, నాగరాజు, వెంకటేష్, ఉసేని పాల్గొన్నారు.

వేధింపులతోనే ఉపాధ్యాయురాలి ఆత్మహత్య



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి

ఆదోని, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి) : ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు భారతి ఆదోనిలోని ఉపాధ్యాయుడి వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందని ఏఐఎస్ఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి దస్తగిరి, జిల్లా సమితి సభ్యుడు లింగప్ప ఆరోపించారు. శుక్రవారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదోని మండలంలోని ఓ పాఠశాలలో పని చేస్తున్న సమయంలో ఉపాధ్యాయుడు ఆమెను మానసికంగా వేధించారన్నారు. ఆ ఉపాధ్యాయుడిని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విచారణ చేస్తున్నారని తెలిపారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలోనే ఆయనపై ఎన్నో ఫిర్యాదులు తాము చేసినప్పటికీ పటించుకోలేదన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు



పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ

దేవనకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామంలో ఓ వ్యక్తి గురువారం సాయంత్రం బాలికపై అత్యాచారయత్నం చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. కోపోద్రిక్తులైన గ్రామస్తులు నిందితుతడి ఇంటిపై దాడి చేశారు. ఇది రెండు వర్గాల ఘర్షణగా మారింది. ఒక వర్గం ఇంటిని మరో వర్గంవారు తగలబెట్టారు. ఇంట్లో ఉన్న వస్తువులు దగ్ధమయ్యాయి. పోలీసులు గ్రామానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గాల వారి ఫిర్యాదు మేరకు, ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసిన్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. ఈ నేపథ్యంలో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య గ్రామంలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

తుగ్గలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ కొమ్మొ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి అధికారులను కోరారు. శుక్రవారం తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీవో హేమసుందర్‌లను వారు కలిసి సమస్యలను విన్నవించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, ఉపాధి పనులు కల్పించాలన్నారు. స్పందించిన అధికారులు ఇప్పటికే గ్రామాల్లో అన్ని పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు పనులు కోరిన వారికి ఉపాధి పనులు కల్పిస్తున్నామని తెలిపారు.

బీజేపీ పాలనపై హర్షాతిరేకాలు: ఎమ్మెల్యే

ఆదోని టౌన్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి) : ప్రదాని మోదీ పాలన ప్రజలలో విశ్వాసం కలిగిస్తోందని, అందుకే పార్టీలో చేరడానికి చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారని ఎమ్మెల్యే డా.పారసారధి అన్నారు. శుక్రవారం కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ ఆధ్వర్యంలో భాస్కర్‌రెడ్డి కాలనీకి చెందిన వందల కుటుంబాలు బీజేపీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి సహకారంతో అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, సీనియర్ నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ, సింహం నాగేంద్ర, కౌన్సిలరులు సురేష్, చిన్న వసీం, కల్లుపోతుల సురేష్, కిట్టు రంగస్వామి, అయ్యన్న పాల్గొన్నారు.

రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడి నేత్రాలు దానం



నారాయణ గుప్త (ఫైల్)

పత్తికొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు నారాయణగుప్త(86) అనారోగ్యంతో కర్నూలు గౌరీగోపాల్ ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మరణానంతరం కళ్లను హైదరాబాద్ ఎల్వీప్రసాద్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. శనివారం పత్తికొండలో ఆయన అంత్యక్రియలను కుమారుడు విశ్వనాథ్‌బాబు, కుటుంబ సభ్యులు నిర్వహించనున్నారు.

ఆర్డీవో భరత్ నాయక్ ఆగ్రహం

మద్దికెర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో తాగి పడేసిన మద్యం బాటిళ్లను చూసి పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో ముందుగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పరిసరాలను పరిశీలిస్తుండగా మద్యం బాటిళ్లు కనిపించడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుశేన్ సాహెబ్, డీటీ శ్రీదేవి, ఆర్ఐ రవికుమార్ పంచాయతీ కార్యదర్శి సుధాకర్, తదితరులు ఉన్నారు.

వైభవంగా అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఆలూరు రూరల్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిర ప్రాంగణంలో శుక్రవారం అభయాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బిలేహాల్ మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం అభయ ఆంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలను అర్చకులు యుగంధర్ స్వామి చేశారు. ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షి అభయ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధి పనులు అడిగితే లేవంటున్నాడు

● ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని నిరసన



ఆలూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి కూలీల నిరసన

ఆలూరు, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు కల్పించమంటే లేవని సమాధానం ఇస్తున్నాడని, తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లును తొలగించాలని శుక్రవారం ఆలూరు మండలంలోని మరకట్టు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు శుక్రవారం ఆలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు రామకృష్ణ, ఏళ్లప్ప, గురుస్వామి మాట్లాడుతూ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తాము చేసిన పనులకు సక్రమంగా కొలతలు వేయడం లేదని, దీంతో తమకు చాలీచాలని వేతనాలు వస్తున్నాయన్నారు. ఉపాధి పనుల్లో బెంగళూర్‌లో ఉన్నవాళ్ల పేర్లను నమోదు చేసి కూలీ డబ్బులు స్వాహా చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించకపోతే గ్రామంలో పనులు బహిష్కరిస్తామన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థి మల్లికార్జునను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద హరివాణం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి మల్లికార్జున జాతీయస్థాయి అండర్-14 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా దేవి, పిజికల్ డైరెక్టర్ రామన్న తెలిపారు. శుక్రవారం జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా దేవి, పిజికల్ డైరెక్టర్ రామన్న తెలిపారు. శుక్రవారం జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మల్లికార్జునను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణమూర్తి, రామకృష్ణ, గణేష్, శివశంకర్ గౌడ్, పుష్పలత, వేణుగోపాల్, చిరంజీవి, సుబ్బయ్య, శివరాజ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

భూకబ్జాల విముక్తి కోసమే రెవెన్యూ సదస్సులు

\- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూ కబ్జాల నుంచి ప్రజలను, రైతులను విముక్తి చేయడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రెవెన్యూ సదస్సులు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం విరుపాపురంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సదస్సుల్లో వచ్చిన అర్జీలను 45రోజుల్లోపు పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ శివరాముడు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

● ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సూర్యపల్లెలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రెవెన్యూ పరిధిలోని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే రైతుల నుంచి పలు సమస్యలు విని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులను సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ తులసిదేవి, తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించం



రామలింగాయపల్లెలో సీసీ రోడ్డుకు కొలతలు వేస్తున్న ఏఈ వెంకటేశ్వర్లు

తుగ్గలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించేది లేదని పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని బొందిమడుగుల, రామలింగాయపల్లె, ఉప్పర్లపల్లి తదితర గ్రామాల్లోని ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద దాదాపు రూ.2కోట్లతో వేస్తున్న సీసీ రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించి కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తోందని, కాంట్రాక్టర్లు నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చి పనులు చేయాలన్నారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు లేకపోతే బిల్లులు చెల్లించేది లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, ప్రతాప్ యాదవ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా షష్టి ఉత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న స్వామివారు

మద్దికెర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని మద్దమ్మకుంట గ్రామ సమీపాన వెలసిన భక్తుల ఆరాధ్యుడు సుబ్రహ్మణ్యస్వామి షష్టి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పురోహితుల ఆధ్వర్యంలో హోమాలను చేశారు. సాయంత్రం గణపతి పూజ, లక్ష్మీపూజ, రుద్రహోమాన్ని నిర్వహించారు. రాత్రి భక్తులకు అన్నదానం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు విజయ ప్రసాద్ యాదవ్, ప్రజలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్



వెల్దుర్తిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



దేవనకొండ మండలం తెర్నేకల్ జడ్పీ పాఠశాలలో ...



ఆదోనిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కాలనీవాసులు



ఆదోనిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

పత్తికొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా.బీఆర్ అంబేద్కర్ అని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు గురుదాస్, సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్‌లు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పత్తికొండ పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి సీపీఐ, డీఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వైసీపీ మండల కన్వీనర్ నాగరాజు, ఎంపీపీ నారాయణ దాసు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వెల్దుర్తిలో...

వెల్దుర్తి టౌన్: భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ జాతికి అందించిన సేవలు చిరస్మరణీయం ఎమ్మార్పీఎస్ నాయకులు బజారు, నాయకంటి గిడ్డయ్య, జే.బజారి, మాజీ జడ్పీటీసీ బజయ్య కోరారు. శుక్రవారం డా.బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా వెల్దుర్తి పాతబస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో నాయకులు మోషా, సూర్యచంద్ర, దేవదానం, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక డా. బీ ఆర్అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వీరుపాక్షి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

● ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆలూరు బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లప్ప గోవింద్ రామంజి, మసాల జగన్, గోవింద్, గద్దం ఆనంద్ పాల్గొన్నారు.

దేవనకొండ: బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని హెచ్ఎం విజయుడు, డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రోశన్న అన్నారు. తెర్నేకల్ జడ్పీ పాఠశాలలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి ఆర్పించారు.

ఆదోని అగ్రికల్చర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆయన పట్టణంలోని ఆయా సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక ఎంఎం కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి కాలనీవాసులు యువజన సంఘం నాయకులు రామదాసు నాగేంద్ర, దండోరా కొండయ్య, తిరుపతయ్య, నూరి కౌన్సిలర్, చిన్న నాగేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్ర, ప్రభాకర్, రాజశేఖర్, ఏసన్న, ఆనందు, హనుమంతు, కదిరికోట సేతు పాల్గొన్నారు. ఏబీవీపీ ఆదోని శాఖ ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ వీరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ, నివాళులర్పించారు.

అంబేద్కర్ ఆదర్శ ప్రాయుడు

ఆదోని రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారథి, తహసీల్దార్ శివరాముడు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆదర్శ ప్రాయుడని, ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు.



ఆలూరులో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన సైనికుడికి ఆర్థిక సహాయం



బాధితులకు డబ్బులు అందజేస్తున్న జనసేన నాయకులు

ఆస్పరి, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలిగెర గ్రామానికి చెందిన హనుమంతు కుటుంబానికి జనసైనికులు అరవిందు, ఉదయ్ శుక్రవారం ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమంతు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని రూ.25వేల 600 నగదును వారి కుటుంబానికి అందజేశారు. జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప చొరవతో కష్టాలలో ఉన్న ప్రతి జనసేన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏపీ కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, జనసేన మండల కన్వీనర్ అరవింద్, శివ, సోమశేఖర్, శ్రీను, రంజిత్, మహదేవ్, అనుమేష్, వీరేష్ విష్ణు, అనిల్, అంజి, సురేష్, ప్రసాద్ వినోద్, ప్రకాష్ పాల్గొన్నారు.

కనీస వేతనాల కోసం కార్మికుల ధర్నా

ఆదోని టౌన్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి) : కనీస వేతనాలు ఇవ్వాలని, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు ఈరన్న మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పురపాలక కార్యాలయాల్లో ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు పనికి తగ్గ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 15 సంవత్సరాలు పైబడి పని చేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని పర్మినెంట్ కార్మికులకు ఇచ్చే అన్ని సౌకర్యాలు కూడా కల్పించాలని కోరారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు సోమన్న, వెంకటేశ్వరులు, శ్రీనివాసులు, రంగా, జ్ఞానమ్మ, పీరా, అహ్మద్ హుస్సేన్, కృష్ణమూర్తి కరెప్ప సీఐటీయూ నాయకులు గోపాల్, తిప్పన్న పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలపై దాడులను సహించం

ఆదోని డివిజన్ ఇన్‌చార్జి పురుషోత్తం రెడ్డి



బాధితుడిని పరామర్శిస్తున్న పురుషోత్తం రెడ్డి

ఎమ్మిగనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలపై దాడిచేస్తే సహించేది లేదని బీజేపీ ఆదోని డివిజన్ ఇన్‌చార్జి, హైకోర్టు అడ్వకేట్ పురుషోత్తం రెడ్డి అన్నారు. గుడికల్ గ్రామంలో రెండురోజుల క్రితం భూమి విషయంలో దాడికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నడవలయ్యను ఆయన పరామర్శించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఉపేంద్ర బాబును కలిసి దాడి సంఘటనను వివరించారు. దాడికి పాల్పడిన వానిపై వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కౌతాళం రామకృష్ణ, బాధితుల బంధువులు, రైతులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పంట



గుడికల్లు గ్రామ పొలాల్లో నేలకొరిగిన వరి పంట

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లోసాగు చేసిన వరిపంటలు నేలకొరిగాయి. దీంతో వరిపంటను సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. మండలంలో దాదాపు 5-6వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగుచేశారు. వర్షాలు కురవడంతో వరిపంట నీటి తడిసి పంటను కోసేందుకు కూడా ఇబ్బందికరంగా మారింది. నీట తడిసిన వరిపంటను వ్యాపారులు క్వింటం రూ.2300లకు అడుగుతున్నారని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వరి ధాన్యం క్వింటం రూ.3వేలకుపైగా పలికిందని ఈ ఏడాది వర్షాలు రావడంతో ధర పడిపోయిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వరిధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

వర్గాలుగా విడిపోయిన వైసీపీ

ఎమ్మిగనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్థంతిని వైసీపీ నాయకులు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే జరుపుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తనయుడు జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ కేశన్న, వైస్ ఎంపీపీ, ఎస్సీ సెల్ నాయకులు బాస్కర్, గోనెగండ్ల నాయకులు, పట్టణ మైనార్టీ నాయకులు రియాజ్, కౌన్సిలర్లుతోపాటు పలువురు నాయకులు సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అర్పించారు. అలాగే పట్టణంలోని శిల్పా కాలనీలో ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి పట్టణ, నందవరం మండలాల నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ రాజు, శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు శివప్రసాద్, కేవరెడ్డి, మాబాషా, నందవరం నాయకులు ముగతి విరుపాక్షిరెడ్డి, గడ్డం నారాయణ రెడ్డి, నరసరాజు తదితరులు ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం దగ్గరకు చేరుకొని నివాళి అర్పించారు. ఇలా వైసీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే అంబేడ్కర్ వర్థంతిని జరుపుకోవటంతో ఎమ్మిగనూరు వైసీపీలో విబేధాలు మరోసారి బయటపడటం చర్చనీయాంశంగా మారింది.

ఇది హాస్టలా?.. పందుల ఆవాసమా?

టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



హాస్టల్ వెనుక మురుగు నీటిని పరిశీలిస్తున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇది విద్యార్థులు ఉండే హాస్టల్ అనుకున్నారా.. లేక పందులకు ఆవాసం అనుకున్నారా? ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా? అని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి ఎస్.రాఘవేంద్రరెడ్డి హాస్టల్ వార్డెన్‌పైన, పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. హాస్టల్ వెనుకభాగంలో మురుగునీరు నిల్వగా ఉండి పందులు స్వైర విహారం చేయడంతో వీటి నుంచి విద్యార్థులకు రోగాలు రావా? అని అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహించారు. హాస్టల్ సమీపంలోనే అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక పాఠశాలలు కూడా ఉండటంతో వారి పిల్లలు హాస్టల్ ముందే మలమూత్ర విసర్జనలు చేస్తున్నారనీ హాస్టల్ విద్యార్థులు, స్థానికులు రాఘవేంద్రరెడ్డి దృష్టికి తెచ్చారు. త్వరితగతిన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలన్నారు. అందుబాటులో లేని వార్డెన్ కోటేశ్వరయ్యపై మండిపడ్డారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, హాస్టల్ విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, చిన్నతాయన్న, వక్రాణి వెంకటేశ్, మాణిక్యరాజు, అంగన్‌వాడీ టీచర్లు లూసమ్మ, వరలక్ష్మి, తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

కోసిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 3వ వార్డు తిమ్మప్పకొండ సమీపంలో శుక్రవారం నిమ్మయ్య స్వామి, గోవిందు ఆధ్వర్యంలో శ్రీకందనాతి మారెమ్మ దేవాలయ నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పురోహితులు పల్లెపాడు మూర్తిస్వామి, దొడ్డి రాజశేఖర్ స్వామి ఆధ్వర్యంలో గోపూజ, మారెమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, మహాగణపతి పూజ, దీక్షా హోమం, చండీహోమాలు, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, యంత్ర స్థాపన, భస్మం కబళి, కళ్వజ్వాల, ఫలన్యాస హోమం, అలంకరణ పూర్ణాహుతి, కుంభాభిషేకం, మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి ఎస్.రాఘవేంద్రరెడ్డి, ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, తోవి రామకృష్ణ, అయ్యన్న, చిన్నతాయన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

- భూ సమస్యల పరిష్కారానికి కృషి
- రెవెన్యూ సదస్సుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు



రైతుల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గుడికల్లు గ్రామంలో శుక్రవారం ప్రారంభమైన రెవెన్యూ సదస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా అంబేడ్కర్ వర్థంతిని పురస్కరించుకొని బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రెవెన్యూ సదస్సులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం రీ సర్వే పేరుతో జరిగిన తప్పులపై సమగ్ర విచారణ జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో రీ సర్వే పేరుతో సర్వే రాళ్లపైన తమ రంగులు కొట్టుకోవడంతో పాటు పాసుపుస్తకాలపై కూడా తమ ఫొటోలను వేయించుకున్నారు. ప్రజలు, రైతుల వద్దకే పాలనా పేరుతో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలు, అధికారులు ప్రజల వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలోని రీసర్వేలో జరిగిన అన్ని తప్పులకు ఈ సదస్సుల ద్వారా పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి చిరంజీవి, ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్, సర్పంచ్ నరసమ్మ, కందనాతి సర్పంచ్ కేశన్న, టీడీపీ నాయకులు మల్లికార్జున, సోమేశ్వరరెడ్డి, రంగన్న, రాఘవేంద్ర, శంకర్‌గౌడు, ఎస్.నాగలాపురం వీరాంజనేయులు, గోపాల్, అయ్యళప్ప, దస్తగిరి, కొండన్న రైతులు పాల్గొన్నారు.

- గుడికల్లు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను మసీదుపురం గ్రామస్థులు కలిశారు. మూడు నెలలుగా తమకు తాగునీరు అందడంలేదని ఫిర్యాదు చేశారు. దీంతో సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు.
- గుడికల్లు గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును ముగించుకొని ఎమ్మిగ నూరుకు తిరిగి వెళ్తున్న సమయంలో గ్రామానికి చెందిన ఓ మహిళ కన్నీటి పర్యంతమవుతూ చేతిలో పేపర్లు పట్టుకొని ఎమ్మెల్యేను పిలిచింది. దీన్ని గమనించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కారును నిలిపి ఆమె సమస్యను విన్నారు. తనకు ఆరోగ్యం బాగోలేదని తమ పరిస్థితి దయనీయంగా ఉందని, బజ్జీలు వేసుకొని బతుకుతున్నానని చెప్పారు. ఎమ్మెల్యే వెంటనే తన ఆరోగ్య సమస్యపై ఉన్నతాధికా రులకు రెఫర్ చేసి సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

వైసీపీ హయాంలో ఆలయ భూములు కబ్జా

- వైసీపీ నాయకుల భూ అక్రమాలను ఆధారాలతో బయటపెడతా
- మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రాలయం నియోజకవర్గంలో దేవాలయ భూములను ఆ పార్టీ నాయకులు కబ్జా చేసి తమ ఆధీనంలోకి ఆక్రమించుకున్నారని, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వైసీపీ నాయకులు చేసిన భూ అక్రమాలను ఆధారాలతో సహా బయట పెడుతానని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కందుకూరు గ్రామంలో రెవెన్యూ సదస్సులకు ముఖ్యఅతిథిగా రాఘవేంద్రరెడ్డి హాజరై మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు వందల ఎకరాల దేవాలయ భూములు, వక్ఫ్ బోర్డు భూములను అప్పటి అధికారుల అండదండలతో భూములను ఆక్రమించుకున్నారని, త్వరలో ఆధారాలతో సహా బయట పెడుతానని స్పష్టం చేశారు. కందుకూరులోనే 70 ఎకరాలకు పైగా దేవాలయ భూములను స్థానిక వైసీపీ నాయకులు కబ్జా చేశారని, అలాగే కామన్‌దొడ్డి, కడిదొడ్డి, బొమ్మలాపురం గ్రామాల్లో దేవాలయ భూములను వైసీపీ నాయకులు కబ్జా చేశారనీ, మరిన్ని పూర్తి వివరాలు ఆధారాలతో సహా బయట పెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, దేవాదాయ శాఖ మంత్రికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు రాఘవేంద్రరెడ్డి తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, చిన్నతాయన్న, నర్సారెడ్డి, కురువ అయ్యన్న, రామిరెడ్డి, నోడల్ అధికారి హిమప్రభాకర్ రాజు, తహసీల్దార్ నిత్యానందరాజు, డిప్యూటీ తహసీల్దార్ రుద్ర గౌడు, ఫారెస్టు రేంజ్ అధికారి తేజశ్విని, సబ్ రిజిస్ట్రార్ బజారి, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కోసిగిలో భగవద్గీత కంఠస్థ పోటీలు

కోసిగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 5వ వార్డులోని గీతామందిరం ఆలయంలో శ్రీగీతా జయంతి సందర్భంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు శ్రీగీతామందిరం కోసిగి ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. శుక్రవారం గీతామందిరంలో శ్రీశ్రీ స్తోత్రాయ బ్రహ్మనిష్ఠ అవ్యక్తనంద సరస్వతి స్వాముల వారిచే పోటీలు నిర్వహించారు. శ్రీనివాసనంద స్వామి, ఆలయ ధర్మకర్త దివంగత చిదానందప్పగారి కుమారుడు ఎరిగేరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. శిశు వర్గం నర్సరి నుంచి 2వ తరగతి వరకు, ప్రారంభ వర్గం 3 నుంచి 5వ తరగతి వరకు, మాధ్యమిక వర్గం 6 నుంచి 7 తరగతులు, ఉత్స వర్గం 8 నుంచి 10వ తరగతి వరకు, అతిఉత్స వర్గం ఇంటర్ నుంచి డిగ్రీ వరకు విద్యార్థులు కంఠస్థ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు కృష్ణమూర్తి, శ్యాందొర, సాయికుమార్, డా.గోపాల్ తెలిపారు. మౌంట్ కార్నల్ హెచ్‌ఎం జాన్సన్, బాలాజీ, రాజశేఖర్, కొల్లి రామకృష్ణ, పార్థసారది, బంగారు వెంకోబ, రంగస్వామి, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

'విజయవంతం చేయాలి'

పెద్దకడుబూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ డేను శనివారం విజయవంతం చేయాలని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దకడబూరులోని ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కలిసి పనిచేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సంకల్పించారన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ విరాళం



కంప్యూటర్‌ను హెచ్‌ఎంకు అందిస్తున్న పూర్వ విద్యార్థి

కౌతాళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కౌతాళం జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థి కె.లక్ష్మణాచారి శుక్రవారం తాను చదువుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.22విలువ చేసే కంప్యూటర్‌ను పాఠశాల హెచ్‌ఎం ఇమ్మానుయేల్‌కు అందజేశాడు. పూర్వ విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయులు పూలమాల శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి సారించాలి: డీఎస్పీ

మంత్రాలయం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలపై దృష్టి సారించి రౌడీషీటర్లు, అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. శుక్రవారం మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్, హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

గోనెగండ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూ సమస్యలపై అర్జీలు అందించారు. తహసీల్దార్ కుమారస్వామి, రీ సర్వే డీటీ శిరీషా, జనార్ధన్ రావు, ఆర్ఐ రామకృష్ణ, పాల్గొన్నారు.

మంత్రాలయం: రైతుల భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఒక వేదిక అని జిల్లా అటవి శాఖ అధికారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్యామల తెలిపారు. శుక్రవారం మండలంలోని చెట్నహళ్లిలో మండల నోడల్ ఆఫీసర్ నారాయణమూర్తి, తహసీల్దార్ ఎస్.రవి ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ఆదాం, వీఆర్వో భీముడు, సర్పంచ్ బెస్త అంజనేయ, ఎంపీటీసీ రామాంజనేయులు, టీడీపీ నాయకులు చేపల నాగేష్, నాగభూషణరావు, భీమయ్య, రైతులు పాల్గొన్నారు.

నందవరం: నది కైరవాడిలో ఆర్ఐ జర్మీయా ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, ఐటీడీపీ నియో జకవర్గ అధ్యక్షుడు వీరేష్, డీలర్ బజారి పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: నౌలేకల్ గ్రామంలోని రెవెన్యూ సదస్సును నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి విజయ, తహసీల్దార్ శ్రీనాథ్, మండల సర్వేయర్ తేజశ్విని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధికి కృషి'

నందవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని జడ్పీ మాజీ వైస్ చైర్పర్సన్ పుష్పావతి అన్నారు. శనివారం జరిగే మెగా పేరెంట్స్ సమావేశానికి రావాలని ఉపాధ్యాయులు ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఏవైనా సస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడు పాల్గొన్నారు.

సీఐని కలిసిన టీడీపీ నాయకులు



సీఐని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నూతనంగా వచ్చిన ఎమ్మిగనూరు రూరల్ సీఐ మధుసూదన్‌రావును హలహర్వి గ్రామ టీడీపీ నాయకులు జగన్నాథరెడ్డి, ఎస్సీ సెల్ తాలుకా అధ్యక్షుడు దావీదు, నాగరాజు శుక్రవారం కలిసి సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సీఐ సూచించారు. పార్టీలకతీతంగా ప్రశాంతంగా జీవించాలన్నారు.

గోనెగండ్లలో కుక్కల వీరంగం

- నవంబరులో 150 మందిపై దాడి
- ఇబ్బందుల్లో మహిళలు, పిల్లలు



గోనెగండ్ల సంత మార్కెట్‌లో సంచరిస్తున్న కుక్కలు

గోనెగండ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని వీధుల్లో కుక్కలు వీరంగం చేస్తున్నాయి. మూడు రోజులుగా గోనెగండ్లలో పెద్దలక్ష్మి, స్వాతి, మబుబీ, నబేల్, నిర్మల, సోమనాథ్, రామాంజినేయలు లతో పాటు మరో 20 మందిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఇందులో కొందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా మరికొందరు నాటు వైద్యం చేయించుకున్నారు. మండలంలోని గోనెగండ్ల, వేముగోడు, తిప్పనూరు, కున్నూరు, అలువాల, కులుమాల, హెచ్ కైరవాడి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో కుక్కలు అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి. జనసంచారం అధికంగా ఉన్న సెంటర్ల దగ్గర, మటన్, చికెన్ దుకాణాల దగ్గర కుక్కల హంగామా సృష్టిస్తున్నాయి. అటువైపు వెళ్లాలంటే పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నవంబరు నెలలో మండలంలోని పలు గ్రామాలలో 150 మందిపై కుక్కలు దాడులు చేశాయి. అందులో 78 మంది ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్లు రికార్డుల్లో నమోదు అయింది. మూడు మాసాలుగా మండల వ్యాప్తంగా 500మందిపై కుక్కలు దాడులు చేసి గాయపరచినట్లు ఆసుపత్రి లెక్కలు చెపుతున్నాయి. ప్రైవేట్‌గా చికిత్స చేయించుకున్న వారి మరో 1000 మందికి పైగానే ఉంటారని పలువురు తెలుపుతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ వీధుల్లో తిరిగే జనంపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఆయా పంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

టీడీపీకి కార్యకర్తలే కీలకం



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

మంత్రాలయం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో టీడీపీ కార్యకర్తలే ప్రధాన కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా సభ్యత్వం నమోదు చేయించి పార్టీ పటిష్ఠతను పెంచాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పంకజ్ అతిథి గృహంలో టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయం, కౌతాళం మండలాల్లో క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, ఐటీడీపీ, టీఎన్ఎస్ఎఫ్, ఎన్టీఆర్, బాల కృష్ణ అభిమానులు ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేసి ప్రజలకు అండగా నిలవా లన్నారు. కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాల కుర్తి తిక్కారెడ్డి, టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పైబావి అమర్నాథ్ రెడ్డి, విజయరామిరెడ్డి, అండే హనుమంతు, నరసింహులు, రాఘవేంద్ర, భీమన్న వడ్డె వీరేష్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో పుష్కరిణికి ఏర్పాట్లు



మధ్వమార్గ్ కారిడార్‌లో దేవదాయ రాష్ట్ర స్థపతితో శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో పుష్కరిణి ఏర్పాటు చేస్తున్నట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం ఈఈ సురేష్ కోనాపూర్, దేవదాయ శాఖ రాష్ట్ర స్థపతి పరమేశప్ప తెలిపారు. శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుళ ఆదేశాల మేరకు మంత్రాలయంలో సుందరంగా భక్తులకు ఆకర్షణీయంగా ఉండే విధంగా పుష్కరిణి నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఇందుకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. మఠం ఏఈ బద్రీనాథ్, శ్రీహరి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి గోవిందమ్మ

మంత్రాలయం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారిణి గోవిందమ్మ అన్నారు. శుక్రవారం మంత్రాలయం రాఘవేంద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలో 104 ద్వారా గర్భిణులకు, బాలింతలకు బీపీ , షుగర్, జ్వరం, టీబీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 35మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయంతి, సుజాత, శ్రీదేవి, ప్రమీల, లక్ష్మి, పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి



గోనెగండ్లలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు/రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్థంతిని నిర్వహించారు. లౌకిక భావనా, ప్రజాస్వామ్య వ్యవస్థలోని స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతృత్వాలను భారతప్రజలకు లభించటానికి తీవ్రంగా కృషి చేసిన మహనీయులు అంబేడ్కర్ అని టీడీపీ, కాంగ్రెస్, జైభీమ్ ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. స్థానిక టీడీపీ కార్యలయంలో టీడీపీ నాయకులు శాలేమ్, పందికోన ఈరన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సోమప్ప సర్కిల్‌అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలుగొట్ల గ్రామంలో పూలే, అంబేడ్కర్ సొసైటీ ఆధ్వర్యంలో నాయకులు మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, గణేష్, బతకన్న, నరసన్న, ప్రతిభా భారతి, రాము, భాస్కర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు బచ్చిబాబు, అబ్రహాం, సత్యానందం, సురేష్, మాలహానాడు మాల నరసన్న, రాజోలప్ప, చెన్నయ్యప్రసాద్, శ్రీరాములు, శేఖర్ పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్, దళిత ఐక్యవేదిక, సుంకేశ్వరిలో డీఎస్, డీఎస్‌పీ సంఘాల నాయకులు వేర్వేరుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు అమ్రేష్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు బ్రతుకమ్మ, జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు గర్జి హనుమన్న, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, సురేష్, ప్రాణేష్, శివ, రాజన్న, జక్కయ్య, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: పెద్దకడుబూరులోని సచివాలయం-2లో అంబేడ్కర్ వర్థంతిని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు యువరాజు, సతీష్, నాగరాజు, సామేలు, విజయ్, ఎల్లప్ప, ఆనంద్, లక్ష్మన్న, సంసోన్, జైరాజు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలో శుక్రవారం అంబేడ్కర్ వర్థంతిని కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించారు. కేవీపీఎస్ నాయకులు కరుణాకర్, భక్తకన్నప్ప, నరసింహులు, శంకర్, మునెప్ప, మారేష్, ఈశ్వర్, తేజ, విజయ్, రాఘవేంద్ర, వీరన్నగౌడ్, రహీం,బీజేపీ నాయకులు మహేష్, శ్రీరామ్ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు